1st Year Happy Work Anniversary.

షణ్ముఖ SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN

సంపుటి : 3 సంచిక : 78 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 23 మార్చి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 78 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Monday 23 March 2026 PAGES : 8 PRICE : 3/-

## పాలనలో.. మోదీ రికార్డు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 22)
తన రాజకీయ జీవితంలో ప్రధాని మోదీ మరో అరుదైన మైలురాయిని చేరుకున్నారు. 8,931 రోజుల పాటు (గుజరాత్ సీఎం పదవీకాలం సహా) ఎలాంటి విరామం లేకుండా దేశంలో సుదీర్ఘకాలం ప్రభుత్వ అధిపతిగా పనిచేసిన వ్యక్తిగా నిలిచారు. ఇప్పటి వరకు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న ఈ రికార్డును మోదీ అధిగమించారు. చామ్లింగ్ సిక్కిం ప్రభుత్వ అధిపతి (ముఖ్యమంత్రి)గా 8,930 రోజులు పనిచేశారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ 2014లో ప్రధానమంత్రి అయ్యే వరకు ఆ పదవిలో ఉన్నారు. అప్పటినుంచి నేటి వరకు ప్రధానిగా కొనసాగుతున్నారు. గుజరాత్‌కు అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా మోదీ నిలిచారు. అంతే కాకుండా ముఖ్యమంత్రిగా ఎక్కువ అనుభవమున్న ప్రధాని కూడా ఆయనే. స్వాతంత్ర్యానంతరం జన్మించి, దీర్ఘకాలం ప్రధానిగా ఉన్న కాంగ్రెసేతర తొలి నేత కూడా మోదీయే. కేంద్రంలో రెండుసార్లు పూర్తి పదవీకాలాన్ని పూర్తిచేసుకొని, మూడోసారి అధికారం చేపట్టిన కాంగ్రెసేతర పార్టీ నేతగా రికార్డు నెలకొల్పారు. వరుసగా 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో తన పార్టీని మోదీ విజయపథంలో నడిపించారు. దీంతో మూడు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని సాధించిన నెహ్రూ రికార్డును సమం చేశారు. గతేడాది జులైలో మోదీ.. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రికార్డును అధిగమించి వరుసగా దేశంలో అత్యధిక కాలం పనిచేసిన రెండో ప్రధానిగా నిలిచారు. వరుసగా ఆరు ఎన్నికల్లో ఒక పార్టీ పక్ష నేతగా ఎన్నికైన ఏకైక నేత నరేంద్రమోదీ. 2002, 2007, 2012లలో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి సీఎం అయ్యారు. 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో నెగ్గి ప్రధాని అయ్యారు.

## ఏప్రిల్ 1 నుంచి బ్యాంకు ఏటీఎమ్, యూపీఐ వాడకంలో కీలక మార్పులు!

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 22)
ఏప్రిల్ 1వ తేదీ నుంచి పలు బ్యాంకులు తమ నిబంధనల్లో కీలక మార్పులు తీసుకువస్తున్నాయి. ముఖ్యంగా ఏటీఎమ్ నగదు ఉపసంహరణ, యూపీఐ లావాదేవీలకు సంబంధించి ఈ కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) వంటివి తమ కస్టమర్ల కోసం కొత్త మార్గదర్శకాలను ప్రకటించాయి. ఈ మార్పుల గురించి వినియోగదారులు ముందే తెలుసుకోవడం ద్వారా అనవసర చార్జీలను నివారించుకోవచ్చు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన ఏటీఎమ్ లావాదేవీల లెక్కింపు విధానంలో మార్పు చేసింది. ఇప్పటివరకు డెబిట్ కార్డు ద్వారా ▶మిగతా 2లో



## 22ఏ నిషేధిత జాబితా నుంచి ఏపీఐఐసీ భూముల తొలగింపు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 22)




పరిశ్రమల అభివృద్ధికి ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీఐఐసీ ద్వారా భూముల కేటాయింపుల్లో అడ్డంకిగా మారిన కీలక అంశాన్ని తొలగించింది. 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న ఏపీఐఐసీ భూములను ఆ జాబితా నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రజలకు పరిహారం చెల్లించిన అనంతరం ఏపీఐఐసీ చేతిలోని ప్రభుత్వ భూములు, డీకేటీ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ▶మిగతా 2లో

# హైదరాబాద్‌ను మించేలా అమరావతి నిర్మాణం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 22)
హైదరాబాద్‌ను మించేలా అమరావతిని నిర్మిస్తామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. వైకాపా పాలనలో అమరావతిని పూర్తిగా పక్కన పడేశారని ఆవేదన వ్యక్తంచేశారు. అత్యంత అధునాతన టెక్నాలజీతో అమరావతిని స్మార్ట్ సిటీగా మారుస్తామన్నారు. కృత్రిమ మేధ వినియోగం, విస్తరణ లక్ష్యంగా గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో ఏర్పాటు చేసిన సౌత్ ఏసియా లెర్నింగ్ సమ్మిట్‌లో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1990 దాటాక మనవద్ద ఇంటర్నెట్ ప్రారంభమైందనీ, 1995 నుంచి నాలెడ్జ్ ఎకానమీ మొదలైందని చెప్పారు. "ఉమ్మడి ఏపీలో ఐటీ కంపెనీలు తెచ్చేందుకు అనేకమందితో మాట్లాడా. దిల్లీ వెళ్లి బిల్ గేట్స్‌ను కలిశా. భారత్‌లో ఐటీ కంపెనీలు పెట్టాలని కోరా. లెక్కలు, ఇంగ్లీష్‌లో భారతీయులు గొప్పవాళ్లని ఆయనకు చెప్పా. హైదరాబాద్‌లో ఐటీ కార్యాలయం పెట్టాలని బిల్‌గేట్స్‌ను కోరా. అప్పట్లో హైదరాబాద్ వచ్చేందుకు వాళ్లు తొలుత నిరాకరించారు. అక్కడికి వస్తే మాకు ఎలాంటి ప్రయోజనాలు కల్పిస్తారని అడిగారు. అప్పట్లో ఐఎస్‌బీ తెచ్చేందుకు ఎంతో కృషి చేశా. శంషాబాద్ విమానాశ్రయం కోసం 5 వేల ఎకరాలు సేకరించాం. హైదరాబాద్‌కు అనేక విద్యాసంస్థలు, నల్సార్, ట్రిపుల్ ఐటీ తీసుకువచ్చాం. అప్పట్లో కేవలం మంజీరా నుంచే తాగునీరు వచ్చేది. కానీ, కేవలం 9 నెలల్లోనే కృష్ణానది నుంచి తాగునీరు తీసుకొచ్చాం. 1999-2004 మధ్య హైదరాబాద్‌ను శరవేగంగా అభివృద్ధి చేశాం. అప్పట్లో నేను కృషి చేయడం వల్లే జినోమ్ వ్యాలీ వచ్చింది. అనేక కారణాల వల్ల 2004లో ఓడిపోయాం. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు పదేళ్లు పట్టింది. 2014 నుంచి 2019 వరకు ఏపీలో అనేక కార్యక్రమాలు చేపట్టాం. కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెడితే ఎన్నికల్లో గెలవలేం. 2019 నుంచి 2024 మధ్య ఏపీలో అభివృద్ధి కుంటుపడింది. 2024లో మళ్లీ వచ్చాక అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నాం. ▶మిగతా 2లో

## ఇరాన్ యుద్ధానికి ఉత్తమ ఔషధం అదే: డబ్ల్యూహెచ్ఓ చీఫ్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 22)
మధ్యప్రాచ్యంలో యుద్ధం అత్యంత ప్రమాదకరమైన దశకు చేరుకుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్‌లోని నతాన్జ్ అణు కేంద్రం, ఇజ్రాయెల్‌లోని దిమోనా అణు సదుపాయం ఉన్న నగరంపై దాడులు జరిగినట్లు వచ్చిన నివేదికలతో పరిస్థితి మరింత తీవ్రంగా మారిందని ఆదివారం ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనలపై అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) దర్యాప్తు చేస్తోందని టెడ్రోస్ తెలిపారు. ప్రస్తుతానికి రేడియేషన్ స్థాయుల్లో ఎలాంటి అసాధారణ పెరుగుదల నమోదు కాలేదని నివేదికలు చెబుతున్నా, అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను ముప్పు సృష్టిస్తుందని హెచ్చరించారు. ▶మిగతా 2లో

## అభివృద్ధిని ఓర్వలేకనే వైకాపా నేతల కుట్రలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 22)



కర్నూలు జిల్లాలో భాజపా నాయకులపై ఆదోని పోలీసులు కేసు నమోదు చేయడాన్ని ఆ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం కర్నూలులోని ఓ ఫంక్షన్ హాల్లో భాజపా రాష్ట్ర నాయకులు పురుషోత్తం రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ఓ ప్రైవేటు సంస్థకు సంబంధించిన భూమి విషయంలో భాజపా నాయకులు రామకృష్ణ, రామస్వామి మధ్యవర్తిత్వం చేశారు. ఈ విషయంలో ఎనిమిది నెలల తర్వాత ఆదోని మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేయడాన్ని తప్పుపట్టారు. కర్నూలు జిల్లాలో అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైకాపా నాయకులు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. పోలీసులు పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ధర్నా చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మరొక యువగళం హామీ నెరవేర్చిన మంత్రి లోకేశ్... దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి ఇక రాష్ట్ర పండుగ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 22)
యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన మరో కీలక హామీని ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారు. ప్రముఖ సంఘ సంస్కర్త, శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలకు ముందు లోకేశ్ చేపట్టిన పాదయాత్రలో ఈ మేరకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ హామీని అమలు చేస్తామని లోకేశ్ అప్పట్లో ప్రకటించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, ▶మిగతా 2లో

## ఓటు హక్కును లాక్కొనే భాజపా ప్రయత్నాలను అడ్డుకుంటాం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 22)
రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలకు ముందు ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(సర్) ప్రక్రియ పేరుతో ప్రజల ఓటు హక్కులను లాక్కొనేందుకు భాజపా నేతృత్వంలోని కేంద్రం యత్నిస్తోందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో భాజపాపై ఆమె తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రంజాన్ సందర్భంగా కోల్‌కతాలోని రెడ్ రోడ్ వద్ద శనివారం జరిగిన ఈద్ ప్రార్థనల అనంతరం ప్రజలను ఉద్దేశించి మమత ప్రసంగించారు. "రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకే సర్ పేరుతో జాబితాలో పెద్ద ఎత్తున ఓటర్లను తొలగించారు. ప్రజల ఓటు హక్కుల్ని లాక్కోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ చేసే యత్నాలను అడ్డుకుంటాం. ప్రజాస్వామ్యాన్ని, ప్రతి పౌరుడి హక్కుల్ని కాపాడేందుకు చివరి వరకూ పోరాడతాం. బెంగాల్‌ను లక్ష్యంగా చేసుకున్న కొందరు ▶మిగతా 2లో



## చమురు, గ్యాస్ సరఫరాపై ఢిల్లీలో ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 22)
పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశంలో పెట్రోలియం, ముడి చమురు, గ్యాస్, విద్యుత్, ఎరువుల రంగాల్లో సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడటంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. ఈ కీలక రంగాల్లో సరఫరా వ్యవస్థను నిరంతరాయంగా కొనసాగించడం, లాజిస్టిక్స్‌ను పటిష్టం చేయడం, పంపిణీ వ్యవస్థలను క్రమబద్ధీకరించడం వంటి అంశాలపై చర్చించారు. దేశ ఇంధన భద్రతను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ప్రధానికి వివరించారు. అంతర్జాతీయ మార్కెట్లలోని ఒడుదొడుకుల ప్రభావం వినియోగదారులు, పరిశ్రమలపై పడకుండా ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని ఉన్నతాధికారులు తెలిపారు. తగినన్ని నిల్వలను కొనసాగించేందుకు, సరఫరా గొలుసును బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచ ఇంధన వాణిజ్యంలో కీలకమైన హార్ముజ్ జలసంధి వంటి సముద్ర మార్గాలకు అంతరాయం కలగవచ్చనే ఆందోళనల నేపథ్యంలో ఈ సమీక్ష ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాలపై ప్రధాని మోదీ ఒకరోజు ముందే ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. శాంతి, స్థిరత్వం అవసరాన్ని నొక్కిచెప్పడంతో పాటు, అంతర్జాతీయ నౌకాయాన మార్గాలను సురక్షితంగా ఉంచాల్సిన ప్రాముఖ్యతను ఆయన వివరించారు. మధ్యప్రాచ్యంపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడంలో ▶మిగతా 2లో

షణ్ముఖ వెలుగు
ePaper www.shanmukhavelugu.com


# విద్యాశాఖ అధికారులతో సమావేశమైన ఎరిక్షన్ బాబు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, మార్చి 22)

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని మండల విద్యాశాఖ అధికారులతో తన క్యాంపు కార్యాలయంలో యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు సమావేశమయ్యారు. స్కూల్స్ పునఃప్రారంభానికి ముందుగా అన్ని విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉండాలని ఎరిక్షన్ బాబు అధికారులను కోరారు. స్మార్ట్ కిచెన్ ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్, ఆర్వో వాటర్ ప్లాంట్స్ నిర్వహణ, స్కూల్ భవనాల రిపేర్లు, హైస్కూల్లో డైనింగ్ హాల్ నిర్మాణాలు ఉండాలన్నారు. లోకేష్ బాబు ఆదేశాల మేరకు "ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య – ప్రతి పాఠశాలకు పూర్తి సదుపాయాలు" ఉండేలా విద్యా రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా అన్ని అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**మొదటి పేజీ తరువాయి**

# హైదరాబాద్‌ను మించేలా అమరావతి నిర్మాణం

ఇప్పుడు అనేక రంగాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉంది. 30 ఏళ్ల క్రితమే ఐటీ గురించి ఆలోచించా. ఏఐ, డేటా సెంటర్లు, క్వాంటమ్, స్పేస్ టెక్నాలజీ వచ్చాయి. డ్రోన్లు, ఎయిర్ అంబులెన్స్‌లు త్వరగా విస్తరిస్తున్నాయి. ప్రస్తుత యుద్ధాల్లో డ్రోన్ టెక్నాలజీ ఎలా ఉందో చూస్తున్నాం. విద్యుత్ సమస్యలను అధిగమించి మిగులు వరకు తీసుకొచ్చాం. సోలార్, విండ్, గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నాం. గ్రీన్ ఎనర్జీరంగంలో దక్షిణాదిలో మేమే నెంబర్‌వన్ " అని చంద్రబాబు అన్నారు.

# ఏప్రిల్ 1 నుంచి బ్యాంకు ఏటీఎమ్, యూపీఐ వాడకంలో కీలక మార్పులు!

ఏటీఎమ్‌లో తీసిన నగదును మాత్రమే ఉచిత లావాదేవీల పరిమితిలో లెక్కించేవారు. కానీ ఏప్రిల్ 1 నుంచి యూపీఐ యాప్‌ల ద్వారా చేసే నగదు ఉపసంహరణలను కూడా ఈ కోటాలోనే పరిగణిస్తారు. హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎమ్‌లలో నెలకు 5 సార్లు, ఇతర బ్యాంకుల ఏటీఎమ్‌లలో (మెట్రోలలో 3, నాన్-మెట్రోలలో 5) ఉచితంగా నగదు తీసుకోవచ్చు. ఈ పరిమితి దాటితే ప్రతి లావాదేవీకి రూ.23తో పాటు పన్నులు చెల్లించాల్సి ఉంటుంది.మరోవైపు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కొన్ని డెబిట్ కార్డులపై రోజువారీ నగదు ఉపసంహరణ పరిమితిని తగ్గించింది. రిస్క్ మేనేజ్ మెంట్, కార్డుల వినియోగం తీరు తెన్నుల్లో ఏకీకృత విధానం కోసం ఈ మార్పులు చేసినట్లు సమాచారం. తాజా రూల్స్ ప్రకారం.. పీఎన్‌బీ కస్టమర్లు తమ డెబిట్ కార్డు రకాన్ని బట్టి రోజుకు గరిష్ఠంగా రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకూ నగదును తీసుకోవచ్చు. గతంలో 1 లక్షల వరకూ నగదు ఉపసంహరణకు అనుమతి ఉన్న కార్డుల పరిమితిలో కూడా కోత పడింది.

ఇక జియో పేమెంట్స్ బ్యాంక్ తన కస్టమర్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి బ్యాంకింగ్ కరస్పాండెంట్ల వద్ద నగదు తీసుకునే కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. అలాగే, ఏప్రిల్ 1 నుంచి రూపే ప్లాటినం డెబిట్ కార్డులపై ఉచిత ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ పొందాలంటే, వినియోగదారులు నిర్దేశిత మొత్తంలో ఖర్చు చేయాలనే కొత్త నిబంధనను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో, కస్టమర్లు తమ బ్యాంకుల తాజా నిబంధనలను తెలుసుకొని తదనుగుణంగా వ్యవహరించడం మంచిది.

# 22ఏ నిషేధిత జాబితా నుంచి ఏపీఐఐసీ భూముల తొలగింపు

ఎలాంటి అభ్యంతరాలు లేని 70 వేల ఎకరాలను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించడానికి అనుమతించింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఏపీఐఐసీ అధీనంలో ఉన్న మొత్తం 51,603.46 ఎకరాల భూముల మ్యుటేషన్‌కు అనుమతించింది. రెవెన్యూ రికార్డులు లేదా వెబ్‌ల్యాండ్‌లో ఏపీఐఐసీ పేరు మీద భూములను మార్చేలా తదుపరి చర్యలు తీసుకోవాలని సంబంధిత జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. సబ్ రిజిస్ట్రార్ల ద్వారా నిషేధిత జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

# చమురు, గ్యాస్ సరఫరాపై ఢిల్లీలో ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష

భాగంగా, భారతదేశం ఇప్పటికే తన చమురు దిగుమతులను అమెరికా, రష్యా, నైజీరియా వంటి దేశాల నుంచి పెంచుకుంది. ప్రస్తుతం మన చమురు దిగుమతుల్లో దాదాపు 70 శాతం గల్ఫ్ యేతర దేశాల నుంచే వస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఎల్‌పీజీ సరఫరాలో ఇబ్బందులు రాకుండా అమెరికా నుంచి కూడా దిగుమతులు చేసుకుంటున్నామని, వినియోగదారుల స్థాయిలో సరఫరాకు ఎలాంటి అంతరాయం లేదని వారు స్పష్టం చేశారు.

# ఓటు హక్కును లాక్కొనే భాజపా ప్రయత్నాలను అడ్డుకుంటాం

ప్రజల మధ్య చిచ్చుపెట్టి వారిని వర్గాలుగా విభజించాలని చూస్తున్నారు. రాష్ట్రంలో సామాజిక ఐక్యతను భంగం చేసే చర్యలను సహించబోం. రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక మతసామరస్యాన్ని పర్యవేక్షిస్తాం. బెంగాల్ సామాజిక వాతావరణాన్ని ఎవరూ చెడగొట్టలేరు" అని మమత స్పష్టం చేశారు.

# మరొక యువగళం హామీ నెరవేర్చిన మంత్రి లోకేశ్... దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి ఇక రాష్ట్ర పండుగ

దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. దీని ప్రకారం, ప్రతి ఏటా మార్చి 23న అన్ని ప్రభుత్వ శాఖలు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించనున్నాయి.

కోనసీమ ప్రాంతానికి చెందిన స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి, శెట్టిబలిజ సమాజంలో విద్య, ఐక్యత, ఆత్మగౌరవం కోసం విశేషంగా కృషి చేసిన గొప్ప సంస్కర్త. శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించి, 19వ శతాబ్దం తొలినాళ్లలోనే అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతగానో పాటుపడ్డారు. విద్య యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పి, సామాజిక చైతన్యానికి బాటలు వేశారు. ఆయన సేవలను గౌరవిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# ఇరాన్ యుద్ధానికి ఉత్తమ ఔషధం అదే: డబ్ల్యూహెచ్ఓ చీఫ్

అన్ని పక్షాలు అత్యంత సైనిక సంయమనం పాటించాలని, శాంతే ఉత్తమ ఔషధమని పిలుపునిచ్చారు. యుద్ధం శాంతిని తీసుకురాదని, రాబోయే తరాలకు ద్వేషించడానికి కొత్త కారణాలను మాత్రమే నేర్పుతుందని ఆయన వ్యాఖ్యానించారు. అణు ప్రమాదాలు సంభవిస్తే స్పందించేందుకు ఇప్పటికే 13 దేశాల్లో తమ సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు.ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా పూర్తిగా తెరవకపోతే, ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లను ధ్వంసం చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. అందులోనూ మొదట అతిపెద్ద ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటామని తన సోషల్ మీడియా పోస్టులలో స్పష్టం చేశారు. ఇప్పటికే ఇరాన్ నౌకాదళం, వాయుసేనతో పాటు యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ వ్యవస్థలను నిర్వీర్యం చేశామని, తమ సైనిక లక్ష్యాలకు దగ్గరగా ఉన్నామని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, హర్మూజ్ జలసంధి తెరిచే ఉందని, కానీ శత్రుదేశాలకు మాత్రం ప్రవేశం లేదని ఇరాన్ కౌంటర్ ఇచ్చింది.

# ఏపీ పరిశ్రమల చరిత్రలో కొత్త అధ్యాయం... రేపు అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌కు చంద్రబాబు శంకుస్థాపన



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 22)

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. రాష్ట్ర ఉక్కు రంగంలో ఇప్పటివరకు ఎన్నడూ లేని విధంగా అత్యంత భారీ పెట్టుబడికి మార్గం సుగమం అయింది. ప్రపంచ ప్రఖ్యాత ఉక్కు దిగ్గజం ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ (ఏఎంఎన్ఎస్) ఇండియా, రాష్ట్రంలో రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఏర్పాటు చేయనున్న ఈ భారీ పరిశ్రమకు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన చేయనున్నారు.

ఈ స్టీల్ ప్లాంట్‌ను రెండు దశల్లో నిర్మించనున్నారు. పూర్తయిన తర్వాత ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని ఇది కలిగి ఉంటుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. ఈ ప్లాంట్‌కు అనుబంధంగా రూ.11,198 కోట్ల వ్యయంతో ఒక క్యాప్టివ్ పోర్టును కూడా నిర్మిస్తున్నారు. దీనివల్ల అదనంగా మరో 6 వేల మందికి ఉపాధి దొరకనుంది. ఏఎంఎన్ఎస్ ఇండియా రాకతో విశాఖ ఎకనమిక్ రీజియన్ ఒక ప్రధాన పారిశ్రామిక హబ్‌గా రూపాంతరం చెందనుండగా, జాతీయ, అంతర్జాతీయ ఉక్కు మార్కెట్‌లో ఈ సంస్థ కీలక పాత్ర పోషించనుంది.

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును వీలైనంత వేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోంది. ముఖ్యంగా, ప్లాంట్ నుంచి జాతీయ రహదారి-16కు అనుసంధానం చేసేందుకు నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులను శరవేగంగా చేపట్టింది. పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు ఇది స్పష్టం చేస్తోంది. పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంలో ప్రభుత్వ నిబద్ధతకు ఈ చర్యలు అద్దం పడుతున్నాయి.

సోమవారం జరిగే ఈ చారిత్రక శంకుస్థాపన కార్యక్రమానికి ప్రభుత్వ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్యాహ్నం నేరుగా రాజయ్యపేటకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3:40 గంటలకు ప్లాంట్‌కు సంబంధించిన ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను సందర్శించి, ఏఎంఎన్ఎస్ ఇండియా స్టీల్ ప్లాంట్ మోడల్‌ను పరిశీలిస్తారు. అనంతరం కేంద్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరిస్తారు. సాయంత్రం 4:50 గంటలకు జరిగే సభలో సీఎం ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమానికి ఆర్సెలార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ నారాయణ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా చైర్మన్ ఆదిత్య మిట్టల్, నిప్పన్ స్టీల్ ప్రతినిధులు హాజరవుతున్నారు.

# పొగాకు బ్యారన్ దగ్ధం


## భారీగా ఆస్తి నష్టం


(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 22)





మండలంలోని మూగచింతల ఎస్సీ కాలనీలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో పొగాకు బ్యారన్ దగ్ధమైన ఘటనలో భారీగా ఆస్తి నష్టం జరిగింది. కాలనీకి చెందిన తిరగాబత్తిన నరసమ్మ కి చెందిన పొగాకు బ్యారన్ లో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. అప్పటికే బ్యారన్ లో ఆరుదులలో ఉన్న సుమారు 1200 పొగాకు అల్లిన కర్ర ఉంది. హఠాత్తుగా ఒకసారి మంటలు చెలరేగి గాలి ప్రభావంతో మొత్తం అంటుకున్నాయి. ఆరు నెలలో ఉన్న అల్లుడు కర్రతో పాటు బ్యారను కూడా పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న కనిగిరి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునే సరికి కాలిపోయింది. బేరన్ గోడలు కూడా వేడితో బీటలు వారాయి. ప్రమాదం జరిగిన అరగంటలోనే భారీగా ఆస్తి నష్టం జరగడంతో బాధిత దళిత కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. సుమారు 15 లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని గ్రామ రైతులు తెలిపారు. అగ్ని బాబా కేంద్రం సకాలంలో అందుబాటులో లేకపోవడం కూడా భారీ నష్టానికి కారణంగా గ్రామస్తులు భావిస్తున్నారు.











ప్రకాశం



మార్కాపురం



బాపట్ల


షణ్ముఖ


# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు                తెలుగు దినపత్రిక

23.03.26        సోమవారం


# ఓటిపి @ రూ.3 వేలు!

**ఉన్నతాధికారులకు, ప్రభుత్వ పెద్దలకు**
**వాస్తవాలు తెలియజేయని కింది స్థాయి ఉద్యోగులు**
**గ్యాస్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న ప్రజానీకం**
**ఓటిపి వచ్చిందా అకౌంట్‌లో రెండు వేలకు పైగా జమ**
**సొమ్ము చేసుకునేందుకే ఉత్సాహం చూపుతున్న ప్రజానీకం**
**వాస్తవ పరిస్థితులను పట్టించుకోని కంపెనీలు, ప్రభుత్వాలు**
**ప్రభుత్వ పెద్దలకు ఫీడ్ బ్యాక్ సక్రమంగా చేరకపోవడమే ప్రధాన సమస్య**
**వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలంటే**
**ప్రభుత్వం ఐవిఆరఎస్ కాల్స్ చేయించాల్సిందే**
**బుకింగ్ చేసిన వారం రోజులకు కూడా ఓటిపి లు రాని పరిస్థితి**
**దాని పై నేటికీ దృష్టి సారించని ప్రభుత్వం**
**రెండు వారాలుగా గ్యాస్ ఏజెన్సీల పై,**
**బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారి పైనే దాడులు**
**ఒక్క హోటల్ పైన కేసు బుక్ చేసిన దాఖలాలు లేవు**
**హోటళ్ళు, రెస్టారెంట్ల పై చర్యలు శూన్యం**
**ఇష్టానుసారంగా హోటళ్ళు, రెస్టారెంట్లకు విక్రయిస్తున్న వినియోగదారులు**




**18వ తేదీ బుధవారం వచ్చిన మెసేజ్....**



**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, మార్చి 22)**

గ్యాస్ మంట రోజు రోజుకు ఆకాశాన్ని తాకుతుంది. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో గ్యాస్ మంట మండింది. వాస్తవానికి దేశంలో 9 శాతం మాత్రమే వినియోగించే కమర్షియల్ సిలిండర్లను రద్దు చేయడంతోనే సమస్య మొదలైంది. ఇదే అదునుగా భావించిన వినియోగదారులు అందినకాడికి దండుకునేందుకు ముందుకు అడుగులు వేశారు. రూ.960 పెట్టి కొనుగోలు చేసిన సిలిండర్‌కు రూ.2000 నుంచి రూ.3000కు అశపడి హోటళ్ళు, రెస్టారెంట్లకు విక్రయించేశారు. ఇదే క్రమంలో ప్రభుత్వాలు ఓటిపిలు ఉంటేనే గాని సిలిండర్లు వినియోగదారులు ఇవ్వవద్దని ఖరాకండింగా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కింది స్థాయిలో వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నప్పటికీ నాలుగు నుంచి వారం రోజుల వరకు ఎటువంటి ఓటిపిలు రావడం లేదు. కానీ వాటిపై ఏ అధికారి కూడా కింది స్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు సమగ్ర సమాచారం చేరవేయలేదు. వాస్తవ పరిస్థితులను దాచిపెట్టారని చెప్పడంలో ఏ మాత్రం ఆశ్చర్యం లేదు. కేవలం గ్యాస్ ఏజెన్సీల పై తప్పుడు సమాచారాలు ఇవ్వడంతో మమ అనిపించుకున్నారు. కాని ప్రస్తుత పరిస్థితుల్లో చాలా మంది గ్యాస్ ఏజెన్సీలు కూడా 90 శాతానికి పైగా ఓటిపిల ద్వారా మాత్రమే గ్యాస్ వినియోగదారులకు ఇస్తున్నారు. అంటే ప్రతి వందలో కేవలం 10 సిలిండర్లు మాత్రమే పక్కకు వెళ్ళాయని అనుకోవచ్చు. సిలిండర్లు తీసుకున్న వినియోగదారుడు మాత్రం తన ఇంట్లో ఇప్పుడే సిలిండర్ అవసరం లేదని భావించుకుని వెయ్యి పెట్టుబడి కి రెండు నుంచి 3 వేలు అధికంగా వస్తుండడంతో ఆ డబ్బుకు ఆశపడి వాటిని బ్లాక్‌లో వినియోగదారుడే విక్రయిస్తున్నాడని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి కాదు. గ్యాస్ కొరత ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వాలు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు, అనధికార గోడౌన్లలో దాడులు చేస్తున్నారే తప్ప అసలు ఇప్పటి వరకు జిల్లాలో ఏ ఒక్క హోటల్, రెస్టారెంట్‌లో అధికారులు దాడులు చేసి గ్యాస్ సిలిండర్లు చేసిన ఘటన లేదంటే అధికారులు ఏ విధంగా పని చేస్తున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. యుద్ధం నేపథ్యంలో గ్యాస్ ఇబ్బందులు తలెత్తుతాయని ముందే గుర్తించాల్సిన కేంద్రం కాస్త ఆలస్యంగా గుర్తించింది. గుర్తించిన వెంటనే తొలి తప్పుగా కమర్షియల్ సిలిండర్లను నిలుపుదల చేసింది. దీంతోనే అసలు బ్లాక్ మార్కెట్‌కు రెక్కలు వచ్చాయి. బాగా ఆదాయం సంపాదించుకునే పెద్ద పెద్ద హోటళ్ళు, రెస్టారెంట్లు సిలిండర్ల పై ఆధారపడి వ్యాపారాలు సాగిస్తారు. వారంతా ఒక్క సారిగా కమర్షియల్ సిలిండర్లు అందుబాటులో లేకపోవడంతో చిన్న సిలిండర్ల పై కన్నేశారు. ఇంకే ముందు మన వినియోగదారులు మరో ముందడుగు వేసి ఏకంగా గ్యాస్ సిలిండర్ ధరను రెండింతలు పెంచేశారు. దీంతో ఓటిపి వచ్చిందంటే ఆ ఇంటికి రూ.2 నుంచి రూ.3 వేలు ఆదాయం వచ్చినట్లైంది. దీంతో బ్లాక్ మార్కెట్‌లో గృహ వినియోగ సిలిండర్లు యథేచ్ఛగా దర్శనమిస్తున్నాయి. కానీ గడిచిన రెండు వారాల్లో ఏ ఒక్క అధికారి కూడా హోటళ్ళు, రెస్టారెంట్ల పై దాడి చేసి చిన్న సిలిండర్లను సీజ్ చేసిన ఘటనలు లేవంటే అధికారులు బ్లాక్ మార్కెట్‌కు ఏ మేర మద్దతు పలుకుతున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా జిల్లాలో అధికార యంత్రాంగం హోటళ్ళు, రెస్టారెంట్ల పై విధిగా దాడులు చేసి గృహ వినియోగ సిలిండర్లను కట్టడి చేయకుంటే రాబోయే రోజుల్లో గ్యాస్ వినియోగదారులు మరింత ప్రమాదంలో పడడం ఖాయం. ఇదిలా ఉంటే గ్యాస్ కొరత ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వం ఓటిపిలు ఉంటేనే సిలిండర్లు డెలివరీ చేయాలని ఆదేశాలిచ్చాయి. కానీ ఓటిపిలు రాకుంటే వాటి ప్రత్యామ్నాయ మార్గాలు చూపడంలో ప్రభుత్వం విఫలమైంది. ఇదే అదునుగా భావించిన ఆయిల్ కంపెనీలు మాత్రం ఓటిపిల సాకుతో ఒక్కో వినియోగదారుడిని వారం రోజులకు తక్కువ కాకుండా తిప్పుకుంటున్నారు. 24 గంటల్లో మీకు రెఫరెన్స్ నెంబర్ పంపిస్తామని చెబుతున్నారే తప్ప ఆ నెంబర్ రావడానికి వారం రోజులు గడిచినా నెంబర్ మాత్రం రాని పరిస్థితి. వీటి పై ఆయిల్ కంపెనీలు గాని ప్రభుత్వం గాని సరైన నిర్ణయం తీసుకున్న పరిస్థితి లేదు. వినియోగదారులు మాత్రం ఓటిపి ల కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిందే. పైగా ఒక్క సారి ఓటిపి వచ్చిందంటే ఆ తరువాత మరలా 45 రోజుల తర్వాత మాత్రమే సిలిండర్ బుక్ చేయాల్సిన పరిస్థితి. మరి అది 45 రోజులతో ఆగుతుందా లేక 60 రోజులకు ఒక సిలిండర్ ఇచ్చే విధంగా ప్రభుత్వాలు, ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకుంటారా అనే దాని పై కూడా చర్చలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికైనా సివిల్ సప్లయి జిల్లా అధికారులు, కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి అసలు సమస్య ఎక్కడ ఉందో తెలుసుకుని దానికి పరిష్కార మార్గం చూపడంతో పాటు ఇప్పటి నుంచి అయినా హోటళ్ళు, రెస్టారెంట్లు, పెళ్ళి మండపాల్లో వినియోగిస్తున్న గృహ వినియోగ సిలిండర్లు ఏ విధంగా వినియోగిస్తున్నారో వాటిని ఎక్కడి నుంచి తెచ్చుకుంటున్నారో నిశితంగా పరిశీలించి వాటి పై దాడులు చేసి చర్యలు తీసుకుంటే తప్ప రాబోయే రోజుల్లో గ్యాస్ కష్టాలు తీరవు. మరి జిల్లా అధికాం యంత్రాంగం ఆ దిశగా అడుగులు వేస్తారో లేదో వేచి చూడాల్సిందే...! ప్రభుత్వం కూడా ప్రతి విషయానికి ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా సమాచారాన్ని తెలుసుకుంటుంది. మరి ఈ గ్యాస్ కష్టాల విషయంలో మాత్రం ఇప్పటి వరకు ఐవిఆర్ఎస్ కాల్స్ చేయలేదు. ఆ దిశగా ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు తక్షణమే ఐవిఆర్ఎస్ కాల్స్ చేస్తే గ్యాస్ వినియోగదారుల కష్టాలు మరింత స్పష్టంగా తెలిసే అవకాశం ఉంది...!

### ఓటిపిల పై ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించాలి

ఇప్పటి వరకు అటు ప్రభుత్వం గాని ఇటు ఆయిల్ కంపెనీలు గాని ఏ మాత్రం ఓటిపిల వ్యవహారంలో సరైన నిర్ణయాలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటి వరకు ఓటిపిలు లేకుండా గ్యాస్ సిలిండర్లను డెలివరీ చేయవద్దని గ్యాస్ ఏజెన్సీలకు గట్టి ఆదేశాలు ఇచ్చారు. అయితే ఆయిల్ కంపెనీలు మాత్రం వినియగదారుడికి ఓటిపి రాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు స్పష్టమవుతుంది. ఓటిపిలు గనుక వస్తే తప్పకుండా వినియోగదారుడికి సిలిండర్ ఇవ్వాల్సిందే. అలా ఓటిపి లు రాని వరకు గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయాల్సిన అవసరం లేదు. దీనినే ఆయిల్ కంపెనీ తమ ఆయుథంగా వాడుకుంటున్నారు. వినియోగదారులను వారం రోజులకు పై బడి ఓటిపిల కోసం ఎదురు చూసే పరిస్థితులు కల్పించింది. ప్రభుత్వం కూడా గ్యాస్ ఏజెన్సీల నుంచి ప్రతి నిత్యం సమాచారం సేకరిస్తుందే తప్ప అసలు ప్రతి నిత్యం ఓటిపిలు రాకుండా ఇబ్బంది పడుతున్న వారి వివరాలు ఇప్పటి వరకు ఏ అధికారి అడిగిన దాఖలాలు లేవని తెలుస్తుంది. ఇప్పటికైనా గ్యాస్ కష్టాలు ప్రజలకు తీరాలంటే గ్యాస్ నిల్వలు సక్రమంగా ఉంచి ఓటిపిలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. ఈ ఓటిపిల వ్యవహారంతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వద్ద గతంలో జరిగే అక్రమాలకు చెక్ పెట్టినట్లు అయ్యింది. ప్రతి ఏజెన్సీ ఓటిపిల ద్వారానే సిలిండర్లు ఇస్తున్నందున ఆ సమస్యకు ప్రభుత్వం స్పష్టమైన చెక్ పెట్టింది. ఈ నిర్ణయం పై ఇటు డీలర్లు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగా తమ పై ఎలాంటి నిందలు వేయడానికి అవకాశం లేకుండా పోయిందంటున్నారు. రాబోయే రోజుల్లో తాము కూడా నూరు శాతం ఓటిపిల ద్వారా మాత్రమే గ్యాస్ సరఫరా చేస్తామన్నారు. దీంతో డెలవరీ బాయ్స్ అక్రమాలకు కూడా ఈ పద్ధతి ఫుల్‌స్టాప్ పెట్టినట్లు అయ్యింది.

# అన్ని వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

**మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**
**టంగుటూరులో లారీ ఓనర్స్ అసోసియేషన్**
**సమావేశంలో పాల్గొన్న మంత్రి స్వామి**



**(షణ్ముఖ వెలుగు, కొండపి, మార్చి 22)**

అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సూచించారు. టంగుటూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా లారీ యజమానులు, పొగాకు కంపెనీ యజమానులు, కలప వ్యాపారులతో టంగుటూరులోని ఓ ఫంక్షన్ హాల్ లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మంత్రి స్వామి ప్రసంగించారు. (తరువాయి 4లో...)

# అన్నదానం కడుపు నింపితే... విద్యాదానం జీవితాన్ని నింపుతుంది

**ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం**
**అధ్యక్షులు మందవ మురళీకృష్ణ**
**ఘనంగా వన్ కే డోనర్స్ ఆత్మీయ సమావేశం**
**కార్యాలయం ఏర్పాటుకు స్థలం చూస్తానని హామీ ఇచ్చిన పోతినేని శ్రీనివాసరావు**







# 24న జిల్లాలో జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం

**మీడియా ప్రతినిధులు తప్పని సరిగా**
**ఆధార్ కార్డుతో ఆసుపత్రికి రావలెను**
**కలెక్టర్ వినోద్ కుమార్ పిలుపు**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మార్చి 22)**

మీడియా ప్రతినిధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో డియంహెచ్ఓ డాక్టర్ ఎస్ విజయమ్మ అధ్యక్షతన 24వ తేదీ (మంగళవారం) ఉదయం 8.30 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నందు జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, (తరువాయి 4లో...)

# అన్నదానం కడుపు నింపితే... విద్యాదానం జీవితాన్ని నింపుతుంది



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 22)

అన్నదానం ఒక పూట కడుపు నింపితే, విద్యాదానం జీవితాన్ని నింపుతుందని ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం వన్ కే డోనర్స్ క్లబ్ సభ్యుల ఆత్మీయ సమావేశం ఒంగోలు మంగమ్మ కాలేజీ ఎదురుగా గల శ్రీ కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి వన్ కే డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు పాటిబండ్ల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ మంచి భోజనం విద్యార్థికి ఒక పూట మాత్రమే కడుపు నింపుతుందని, అదే విద్యార్థికి మంచి విద్యను అందించడం ద్వారా అతను ఉన్నత శిఖరాలకు ఎదిగి మరింత మందికి ఉపాధి చూపుతాడని పేర్కొన్నారు. సంఘం స్థాపించిన 16 నెలలలో వందల మంది విద్యార్థులకు చదువుల నిమిత్తం సహాయం,స్వయం ఉపాధి నిమిత్తం, క్రీడలు, వైద్యం వంటి విషయాలలో ఇబ్బంది పడుతున్న పేదలకు తమ వంతుగా ఆర్థికంగా సహాయ సహకారాలు అందించామన్నారు. కేవలం కమ్మ సామాజిక వర్గం వరకే కాకుండా, ఇతర కులాలలోని పేదలు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో తమ సంఘం ద్వారా మరింత ఎక్కువమందికి సహాయం జరిగే విధంగా క్లబ్ సభ్యులను పెంచుకుంటూ అందరి సహకారంతో మరింత సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. సంఘం ప్రధానకార్యదర్శి అలా హనుమంతరావు మాట్లాడుతూ సివిల్స్, గ్రూప్ 1, 2 ఇతర పోటీ పరీక్షలుకి శిక్షణ పొందే వారికి తమ సంఘం నుండి ప్రోత్సహిస్తామని తెలిపారు. వివిధ కళాశాలలో చదివే విద్యార్థుల చదువుల నిమిత్తం 11 లక్షల రూపాయలను అతిధుల చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. మద్దిపాడు మండల టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘ కార్యకలాపాలు విస్తృత పరిచేందుకు మద్దిపాడు మండల పరిధిలో హైవేకి సమీపంలో కార్యాలయం ఏర్పాటుకు రెండు నెలల వ్యవధిలో స్థలం చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కామని చినబాబు, డాక్టర్ మాల్యాద్రి నాయుడు, డాక్టర్ కామేపల్లి చంద్రశేఖర్, డాక్టర్ మండవ కమలా సుభాష్, శ్రీ ప్రతిభ విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు ,చిడిపోతు వెంకటేశ్వర్లు, మందాడి రాఘవరావు, రావుల పద్మజ, వడ్డంపూడి సుజాత, ఆర్ల వెంకటరత్నం, ఉప్పలపాటి నాగేంద్రమ్మ, మండవ సుబ్బారావు, గోగినేని రామారావు, బొడ్డపాటి వెంకట్, గడ్డం ఆదినారాయణ, సంఘ సభ్యులు, టీం లీడర్లు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## 24న జిల్లాలో జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం

వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ వైద్య శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు, వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. మీడియా ప్రతినిధులు వారి కుటుంబ సభ్యులు తప్పని సరిగా ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలన్నారు. ఈ వైద్య శిబిరాన్ని మీడియా ప్రతినిధులు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని, సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# అన్ని వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి



లారీ ఓనర్లు న్యాయబద్ధంగా కష్టమర్లకు ఇబ్బందులు లేకుండా రవాణా సాగించాలన్నారు. జిల్లా అంతట రవాణా ధరలు ఒకే విధంగా ఉండేలా చూడాలని చెప్పారు. యువగలం పాదయాత్రలో నారా లోకేష్ లారీ ఓనర్స్ అసోసియేషన్ కు గ్రీన్ టాక్స్ తగ్గింపు చేస్తామని ఇచ్చిన హామీనీ నెరవేర్చామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుంతల రోడ్లను మరమ్మత్తులు చేసి వాహనాలు దెబ్బ తినకుండా పరోక్షంగా చర్యలు చేపట్టామని అన్నారు. జిల్లాలో ఏర్పాటు కానున్న పరిశ్రమల ద్వారా అసోసియేషన్ కు రవాణా రంగం ద్వారా లాభాలు పొందడానికి అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలో రహదారులపై రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు బ్లాక్ స్పాట్లను ప్రతి జిల్లాలో గుర్తించామన్నారు. రహదారుల్లో రక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రతి జిల్లాకు రూ.కోటి నిధులను ముఖ్యమంత్రి ఇవ్వనున్నట్లు తెలిపారు. టంగుటూరు టోల్ పన్ను రాయితీపై అసోసియేషన్ నిర్వాహకులు అర్జీ సమర్పించాలని, విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి కేంద్ర ప్రభుత్వానికి లేఖ పంపిస్తామని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం బ్యాటరీ వాహనాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందని. బ్యాటరీ వాహనాలపై రాయితీ కల్పిస్తున్నట్లు, దీనిని లారీ ఓనర్స్ అసోసియేషన్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిగురుపాటి గిరి, ఒంగోలు, కందుకూరు, టంగుటూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కల్లూరి అంజిబాబు, కంచర్ల మాధవరావు, కొత్త నాగేశ్వరరావు, సూధనగుంట శ్రీనివాసరావు, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాల కట్టడికి ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేసిన ప్రకాశం పోలీసులు

### పేకాట ఆడుతున్న స్థావరం పై పోలీసుల దాడులు

### అదుపులో ఏడుగురు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 22)

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాల పై ప్రత్యేక పోలీసు బృందాలు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ యు సుధాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ సుదర్శన్, ఏఎస్ఐ మహబూబ్ భాషా, సిబ్బంది కలసి కొండేపి పోలీస్ స్టేషన్ పరిధిలోని అనకర్లపూడి గ్రామ పొలాలలో పేకాట స్థావరం పై ఆకస్మికంగా దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఏడుగురికి వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 7 మోటార్ సైకిళ్లు, 7 సెల్ ఫోన్లు, రూ.46,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూద క్రీడలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాగే జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

# పేకాట, కోడి పందాలు, క్రికెట్ బెట్టింగ్ పై కట్టుదిట్టంగా చర్యలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 22)

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఉమ్మడి ప్రకాశం జిల్లా పోలీసులు పేకాట, కోడి పందాల స్థావరాలు, క్రికెట్ బెట్టింగ్‌లపై ఆదివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రత్యేక దాడులలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగి, ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఆధునిక సాంకేతికతను వినియోగించారు. అందులో భాగంగా డ్రోన్ కెమెరాలను సమర్థవంతంగా ఉపయోగిస్తూ విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా కొండ ప్రాంతాలు, పొలాలు, చెట్లతో కప్పబడి ఉండే ప్రాంతాలు మరియు సులభంగా గుర్తించలేని రహస్య ప్రదేశాలలో నిర్వహిస్తున్న పేకాట, కోడి పందేల శిబిరాలను గుర్తించడంలో డ్రోన్ కెమెరాలు కీలక పాత్ర పోషించాయి. ప్రకాశం, మార్కాపురం జిల్లా వ్యాప్తంగా 01.02.2026 నుండి ఇప్పటి వరకు 41 పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 189 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుండి రూ.4,82,394 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే 10 కోడి పందేలు స్థావరాలపై దాడులు నిర్వహించి 84 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ.2,10,180 నగదు మరియు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. క్రికెట్ బెట్టింగ్‌పై ఒక కేసు నమోదు చేసి నలుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద 3 ల్యాప్‌టాప్‌లు, 21 సెల్ ఫోన్లు, రూ 24 లక్షల నగదు, ఇతర పరికరాలు మరియు 3 కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నారు. మట్కా నిర్వహిస్తున్న 5 స్థావరాలపై దాడులు నిర్వహించి 10 మందిని అరెస్ట్ చేసి రూ.15,760 నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ బెట్టింగ్ దుష్ప్రభావాలపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, సుమారు 1500 మందికి పైగా యువత, తల్లిదండ్రులకు చట్టపరమైన పరిణామాలు, ఆర్థిక నష్టాలు, కుటుంబాల పై ప్రభావం గురించి వివరించారు. యువత చెడు అలవాట్లకు లోనుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ, ఆన్లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ ప్రమాదాలను వివరించారు. తల్లిదండ్రులు పిల్లలపై పర్యవేక్షణ ఉంచాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పేకాట, కోడి పందాలు ఆడే పాత ముద్దాయిలు, నిర్వాహకులను ముందస్తుగా 98 మందిని బైండోవర్ చేయడం జరిగింది. అసాంఘిక కార్యకలాపాలు ఎవరైనా నిర్వహించినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. నేర నియంత్రణలో ప్రజల సహకారం అత్యంత కీలకమని, శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ పరిసరాల్లో జరుగుతున్న అనుమానాస్పద కదలికలను గమనించాలని సూచించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన ఏ సమాచారం తెలిసినా ప్రజలు వెంటనే డయల్ 112 లేదా పోలీసుల వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయవచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పోలీసులు హామీ ఇచ్చారు.

# ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా కార్డన్ సెర్చ్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 22)**

మాదక ద్రవ్యాల నిర్మూలనే, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మద్దిపాడు మండలం, బురేపల్లి కాలనీ, పరిసర ప్రాంతంలో ఆదివారం విస్తృత స్థాయిలో ఆపరేషన్ వజ్రాప్రహార్‌లో భాగంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఒంగోలు రూరల్ ఇన్స్పెక్టర్ శేషగిరి, 10 మంది ఎస్‌ఐలు, 50 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ పరికరాల ద్వారా అనుమానితులను తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి ఇళ్లు, దుకాణాలు, గంజాయి కేసుల్లోని పాత ముద్దాయిల ఇళ్లు, ఇతర ప్రదేశాలను సోదాలు చేశారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 27 మోటార్ సైకిల్ మరియు ఒక ఆటో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొందరు వాహన యజమానులకు చలానాలు విధించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, కొత్త చట్టాలు, మహిళలపై నేరాలు మరియు వాటి శిక్షల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. తదనంతరం "డ్రగ్స్ వద్దు బ్రో" అనే నినాదంతో స్థానిక ప్రజలతో కలిసి గంజాయికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. యువత, వ్యాపారులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని "గంజాయిని పారదోలుదాం - డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడుదాం" అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, ఉపాధి వంటి వాటిపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ విక్రయం లేదా వినియోగానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు సైబర్ నేరాల పై అవగాహన కలిగి ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని సూచించారు.











## శక్తి చిన్నపిల్లల హాస్పిటల్ ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 22)**

మండల కేంద్రమైన ఉలవపాడులో జివిఎస్‌ఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు ఆదివారం కందుకూరు శక్తి చిన్నపిల్లల హాస్పిటల్ వైద్యనిపుణులు డాక్టర్ కె వి అశోక్ చౌదరి పాల్గొని సుమారు 90 మంది చిన్న పిల్లలను పరీక్షించి వారికి అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఉచితంగా అందజేశారు. అంతే కాకుండా ఈ ఎండాకాలంలో పిల్లలకు డీ హైడ్రేషన్ కారణంగా వచ్చే ఆటలమ్మ, చంపలమ్మ, దద్దు వంటి అంటు వ్యాధులకు పాటించవలసిన జాగ్రత్తలను పిల్లల తల్లిదండ్రులకు సూచించడం జరిగింది. ఈ సందర్భంగా శక్తి చిన్న పిల్లల హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ కెవి అశోక్ చౌదరి మాట్లాడుతూ మా శక్తి చిన్నపిల్లల హాస్పిటల్ ఆధ్వర్యంలో కందుకూరు నియోజకవర్గంలో ప్రతి మండల కేంద్రంలో ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, చిన్నపిల్లలకు సంబంధించిన అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేసి, మందులు ఉచితంగా పంపిణీ చేసి వైద్య సేవలు అందిస్తామని, అంతేకాకుండా మా కందుకూరు శక్తి చిన్నపిల్లల హాస్పిటల్ నందు చిన్నపిల్లలకు సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలు 24/7 గంటలు అందుబాటులో ఉండి చిన్న పిల్లలకు సంబంధించిన మెరుగైన వైద్య సేవలు అందించడమే మా శక్తి చిన్నపిల్లల హాస్పిటల్ వారి లక్ష్యమని ఆయన తెలియజేశారు. ఈ వైద్య శిబిరం నందు శక్తి చిన్న పిల్లల హాస్పిటల్ సిబ్బంది, హాస్పిటల్ మార్కెటింగ్ హెడ్ నాయుడు హరిప్రసాద్ పాల్గొన్నారు.








## నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మార్చి 22)**

మార్కాపురం జిల్లా కలెక్టరేట్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో స్పష్టంగా రాసుకొని అధికారులకు అందజేయాలని కోరారు. మార్కాపురం జిల్లాలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కుటుంబ కలహాలతో హత్య

### పిల్లనిచ్చిన మామకు గాయాలు

**మామ తమ్ముడు ఖాజావలి అడ్డురాగా అతనిపై కత్తితో దాడి**

**ఖాజావలి మృతి**

**అల్లుడు పీరావలి పరార్**

**బేస్తవారిపేట గాంధీ బజార్లో దారుణం**

**దర్యాప్తు చేపట్టిన పోలీసులు**





**(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, మార్చి 22)**

బేస్తవారిపేట మండలం బేస్తవారిపేట గాంధీ బజార్లో దారుణం చోటు చేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా మామ హుస్సేన్‌ను కత్తితో పొడిచాడు, అంతటితో ఊరుకోకుండా ఈ ఉదంతాన్ని అడ్డుకోబోయిన మామ తమ్ముడైన ఖాజావలిని సైతం కత్తితో పొడిచాడు. ఈ ఘటనలో ఖాజావలి మృతిచెందాడు. మామ హుస్సేన్ గాయపడగా కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పిల్లనిచ్చిన మామను మామ తమ్ముణ్ణి కత్తితో పొడిచిన అల్లుడు పీరావలిది గిద్దలూరు మండలం, పొదిలకొండ పల్లెగా తెలిపారు. కాగా నిందితుడు అక్కడ నుంచి పారిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన ఒక చిన్న పిల్లవాడు అరవగా అందరూ గమనించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# మల్లయ్య హత్య పై సమగ్ర విచారణ జరపాలి

**కుట్రదారులకు సహకరించిన స్టేషన్ సిబ్బంది పై చర్యలు తీసుకోవాలి**

**వారి కుటుంబాన్ని ఆదుకోవాలి**

**రాష్ట్ర కాపు జేఏసి అధ్యక్షులు చందు జనార్ధన్,**

**ప్రకాశం జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ డిమాండ్**







**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మార్చి 22)**
మండలంలో ఇడుపూరు గ్రామంలో నివాసం ఉండే సంకుల మల్లయ్యను ఈ నెల 20న శుక్రవారం ఉదయం హత్యకు గురయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం వారి గ్రామానికి వెళ్ళి మల్లయ్య కుటుంబాన్ని రాష్ట్ర కాపు జేఏసి అధ్యక్షులు చందు జనార్ధన్, ఉమ్మడి ప్రకాశం జిల్లా కాపు సంఘం అధ్యక్షులు కొక్కిరాల సంజీవ కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, మార్కాపురం కాపు సంఘం నాయకులు పరామర్శించి, దివంగత మల్లయ్యకు సంతాపాన్ని తెలిపి వారికుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. అనంతరం మార్కాపురం జనసేన పార్టీ కార్యాలయంలో మార్కాపురం జిల్లా కాపు సంఘం నాయకులు వంద మంది వరకు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పాల్గొన్న ముఖ్య కాపు నాయకులందరు కలసి ప్రధానంగా మూడు డిమాండ్లు చేశారు. సంకుల మల్లయ్య హత్య పై సమగ్ర విచారణ జరపాలి. కుట్ర దారులను సంహరించిన వారి పై చర్యలు తీసుకోవాలి అరెస్ట్ చేయాలి. కుట్ర దారులకు సహకరించిన స్టేషన్ సిబ్బంది పై చర్యలు తీసుకోవాలి. మల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, లేని పక్షంలో మార్కాపురంలో కానీ లేదా దివంగత మల్లయ్య గ్రామం ఇడుపూరులో నిరసన కార్యక్రమాలు చెయ్యాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ సమావేశంలో సంకుల సుబ్బారాయుడు, ఆకుల గిరిబాబు, బీమిశెట్టి బాలకోటయ్య, సంకుల మల్లిఖార్జునరావు, భగవాన్, పసుపులేటి శ్రీనివాసరావు, కంభం వెంకటరమణరావు, చేబ్రోలు నాగేశ్వరరావు, రాజా రమేష్ బాబు, మేడిద రంగస్వామి, నరసింహారావు, ఎన్వి సురేష్ బాబు, పెన్నిబోయిన శ్రవణరావు, పిచ్చయ్య, ఖాసీం, ఇనుపగోళ్ళ వెంకటేశ్వర్లు, కాశీరామ్, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

**కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం**

**వైయస్ఆర్‌సిపి రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ఆదిత్యరెడ్డి**





**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మార్చి 22)**
బద్వేల్ మండలం బయనపల్లె గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సేవాదళం అధ్యక్షులు నాగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో యువతతో సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ యువ నాయకుడు, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి హాజరై యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుండి 2024 వరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు పేద విద్యార్థులు, మహిళలు, వృద్ధులకు ఎంతో మేలు చేశాయని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమవుతోందని విమర్శించారు. అలాగే వైఎస్ఆర్‌సిపి నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తల పై ఒత్తిడులు ఉన్నప్పటికీ ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకుండా పార్టీకి అండగా నిలవాలని యువతకు పిలుపునిచ్చారు. “మీకు ఎలాంటి సమస్య వచ్చినా మీ వెంట నేను ఉంటాను” అంటూ దేవసాని ఆదిత్యరెడ్డి భరోసా ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కృషి చేయాలని, 2029లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిగా చేయాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయి నారాయణరెడ్డి, రవికుమార్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, అధిక సంఖ్యలో యువ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# గుడ్లూరులో కార్డన్ సెర్చ్



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మార్చి 22)**
మాదక ద్రవ్యాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిని లక్ష్యంగా చేసుకుని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు గుడ్లూరు ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్ఐలు, 30 మంది పోలీసు సిబ్బంది కలిసి గుడ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్టీ కాలనీ, పరిసర ప్రాంతాల్లో ‘ఆపరేషన్ వజ్రా ప్రహార్’లో భాగంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తనిఖీలలో భాగంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి ఇళ్లు, దుకాణాలు, పాత ముద్దాయిల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 20 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని, కొందరికి చలానాలు విధించారు. ఫింగర్ ప్రింట్ పరికరాలతో అనుమానితులను తనిఖీ చేశారు. రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, మహిళల భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. “డ్రగ్స్ వద్దు బ్రో” నినాదంతో ర్యాలీ నిర్వహించి, గంజాయి నిర్మూలనకు ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. గుడ్లూరు ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, ఉపాధి వంటి వాటిపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ విక్రయం లేదా వినియోగానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని సూచించారు.







# ఘనంగా పార్లమెంట్ కమిటీ ప్రమాణ స్వీకారం
## కందుకూరు నుంచి భారీగా
# హాజరైన తెలుగు తమ్ముళ్లు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మార్చి 22)

తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటరీ కమిటీ ప్రమాణస్వీకారం ఆదివారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో అట్టహాసంగా జరిగింది. కందుకూరు నియోజకవర్గం నుంచి కమిటీకి ఎంపికైన పలువురు నేతలు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఉన్నం వీరస్వామి (పోకూరు), అధికార ప్రతినిధిగా చదలవాడ కొండయ్య (కందుకూరు) కార్యనిర్వాహక కార్యదర్శులుగా షేక్ రూబీ (కందుకూరు), మద్దసాని మహేంద్ర (ఆత్మకూరు), కార్యదర్శిగా దార్ల యలమందమ్మ (ఉలవపాడు) చేత కమిటీ అధ్యక్షుడు బీద రవిచంద్ర ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమకు కమిటీ సభ్యులుగా అవకాశం కల్పించిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడుతూ, రాబోయే ఎన్నికల్లో మళ్ళీ నాగేశ్వరరావు గెలుపు కోసం, పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని తెలిపారు. కందుకూరు నియోజకవర్గానికి చెందిన పలువురు టిడిపి నేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరై, నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, ఉలవపాడు మండల అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, వలేటివారిపాలెం మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బెజవాడ ప్రసాద్, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, నాయకులు వడ్డేళ్ళ రవిచంద్ర, రాయపాటి శ్రీను, షేక్ గౌస్ బాషా, గడ్డం మాలకొండయ్య, పసుపులేటి రమణయ్య, సయ్యద్ జాకీర్, పొడపాటి మాధవ, కందగడ్ల వరుణ్, చిరుతోటి గిరిబాబు, పర్సు నాగేశ్వరరావు, చెవూరి రమేష్, చదలవాడ ఇమ్మనియేలు, పోలుబోయిన శ్రీను, లక్కంరాజు నరేష్, చక్రవర్తుల విజయ్ కుమార్, అమ్మనబ్రోలు రమేష్, యనమల రామారావు, అమ్మనబ్రోలు మాధవ, తదితరులు పాల్గొన్నారు.







## మంచి హస్తవాసిగా పేరుగాంచిన ఆర్ఎంపీ వైద్యులు వెంకటేశ్వర్లు మృతి బాధాకరం
### కేశవరపు జాలిరెడ్డి





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 22)

అందరికీ అందుబాటులో ఉంటూ, మంచి హస్తవాసిగా పేరుగాంచి కరేడు ప్రజలకు సుదీర్ఘకాలం వైద్యాన్ని అందించిన వ్యక్తి ఆర్ఎంపి వైద్యులు వెంకటేశ్వర్లు అని, అలాంటి వ్యక్తి అకస్మాత్తుగా మరణించడం చాలా బాధాకరమైన వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేశవరపు జాలిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి గుంటూరు ఆసుపత్రిలో మరణించిన వారి మృతదేహానికి ఆదివారం కరేడులో ఘనమైన అశ్రునివాళి అందించారు. వారి కుటుంబం సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, వారి సేవలను కరేడు ప్రజలు మర్చిపోరని, వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని వారు తెలియజేశారు. వారితో పాటు కరేడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామాల కృష్ణారెడ్డి, పీతా రామకృష్ణ, గొల్లపోతు నాంచార్లు, నరసింహారావు, కరేటి కోటేశ్వరరావు, చిట్టా మహేంద్ర, తదితరులు ఉన్నారు.

## జిల్లాలో ప్రజలకు అందుబాటులో 6027 గ్యాస్ సిలిండర్లు
## జిల్లాలో గ్యాస్ కొరత లేదు
### గ్యాస్‌కు సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు కంట్రోల్ రూమ్ నెం 9493247765
### డిఎస్ఓ జమీర్ బాషా

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మార్చి 22)



ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే గ్యాస్ సిలిండర్లకు నగదు ఎక్కువగా వసూలు చేస్తే అట్టి గ్యాస్ ఏజెన్సీల పై నిత్యావసరాల చట్టం 1955 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆర్ జమీర్ భాష ఆదివారం ఒక తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లు బరువు తగ్గిన, అధిక ధరలకు అమ్మిన అట్టి గ్యాస్ ఏజెన్సీల పై నిత్యావసరాల చట్టం 1955, ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని 27 గ్యాస్ ఏజెన్సీలకు సంబంధించి 6027 గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని గ్యాస్ ఏజెన్సీ లను సి ఎస్ డిటీలు, తహశీల్దార్లు తనిఖీ చేయడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లా కలెక్టరేట్, డివిజనల్ స్థాయిలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అసత్య ప్రచారాలు నమ్మి వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా యల్.పి.జి. గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉండేలా పటిష్ఠ చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. గ్యాస్ కంపెనీల ద్వారా సరఫరా సాధారణంగానే కొనసాగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్యాస్ కొరత వస్తుందనే ఉద్దేశంతో వెంట వెంటనే ఆన్లైన్లో గ్యాస్ బుకింగ్ చేయడానికి వెబ్ పోర్టల్ అనుమతించదని కేవలం పట్టణనాలలో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాలలో45 రోజులు తర్వాత మాత్రమే గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని బుక్ చేసిన తర్వాత 7 రోజులలోగా సిలిండర్ వస్తున్నదన్నారు. గృహ అవసరాలు, సంక్షేమ వసతి గృహాలు మరియు ఇతర అత్యవసర సేవలకు గ్యాస్ సరఫరాలో నిలుపుదల ఉండదని స్పష్టం చేశారు.

అవసరానికి మించి గ్యాస్ సిలిండర్ల ను నిల్వ చేయడం లేదా కొనుగోలు చేయడం చేయరాదన్నారు. ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలన్నారు. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లను (14.21 కిలోల) వాణిజ్య అవసరాల కోసం తరలించిన, వినియోగించిన అట్టి వారిపై నిత్యావసరాల చట్టం 1955, ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## పురాణ విజ్ఞానం పై
# విద్యార్థులకు శిక్షణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 22)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్త నిర్వహణలో శ్రీగిరి గో క్షేత్ర భవన్‌లో ఆదివారం ఏర్పాటైన శ్రీగిరి బాలవిహార్ శిక్షణా తరగతులలో విద్యార్థులకు భారత భాగవత రామాయణ భగవద్గీత హనుమాన్ చాలీసా పారాయణ అంశాలతో పాటు అష్టాదశ పురాణాలకు సంబంధించిన అంశాలపై కూడా శిక్షణ అవగాహన కల్పించే ప్రక్రియకు శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. వేద వ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాలకు తోడు మరో 18 ఉప పురాణాలు కూడా ప్రచారంలో ఉన్నాయని పురాణ విజ్ఞానానికి సంబంధించిన విషయాలను నేటి తరం విద్యార్థులకు తప్పక తెలియ చెప్పవలసిన బాధ్యత ఎంతైనా ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు హనుమాన్ చాలీసా.. గోవింద నామాలను అప్పగించడంతో పాటు అంత్యాక్షరి చిత్ర లేఖనం వంటి అంశాలలో తమ ప్రతిభను చాటి చెప్పారు. బాల విహార్ శిక్షణా తరగతులు విద్యార్థులలోని బహుముఖ నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని మరింతగా సద్వినియోగం చేసుకోవాలని శ్రీగిరి ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.





# పేదల విద్య పై మనువాద విషం కక్కిన ద్రోణాచార్యుడు గరికపాటి

## ఆయనకు ఇచ్చిన పద్మశ్రీ, ప్రభుత్వ సలహాదారుడు పదవులను రద్దు చేయాలి

## దళిత నేత నీలం నాగేంద్ర డిమాండ్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 22)**

మధ్యాహ్న భోజనం పథకంలో పేద పిల్లలకు కోడుగుడ్డు పెట్టటం దండగని పేద పిల్లలను శోభనం పెళ్లి కొడుకుల్లాగా ప్రభుత్వం చూస్తుందని పుస్తకాలు యూనిఫామ్ భోజనం పెట్టకూడదని కూటమి ప్రభుత్వ సలహాదారుడు గరికపాటి నరసింహారావు చేసిన మనువాద వ్యాఖ్యలపై కూటమి ప్రభుత్వ పెద్దలు స్పందించాలి. ఆదివారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ ఇటీవల ప్రవచనాలు పంచాంగాలు చెప్పుకొని బతికే గరికపాటి నరసింహారావుకి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పద్మశ్రీని రద్దు చేయాలి, అలాగే సనాతన ధర్మం ఆచరణ దిశలో కూటమి ప్రభుత్వ ద్రోణాచార్యుడు గరికపాటికి ఇచ్చిన ప్రభుత్వ సలహాదారు పదవిని కూడా తొలగించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. రాజమండ్రిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో మధ్యాహ్న భోజనంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కును కాపాడుతూ విద్యార్థుల పౌష్టికాహారం అందిస్తున్న పై గరికపాటి శాపనార్థాలు పెట్టడం విచిత్రంగా ఉందన్నారు. మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు పెట్టడం ఏంటి గాడిద గుడ్డు లాగా భోజనం, పుస్తకాలు, యూనిఫామ్ లు ప్రభుత్వం ఇవ్వటం ఏమిటి ఈ పిండాకూడంటం, తద్దినాలు చేసుకొని బ్రతికే గరికపాటి అజ్ఞానానికి అసూయకు నిదర్శనం అన్నారు. పిల్లలు చదువుకోకపోతే వెళ్లిపొమ్మనండి ప్రభుత్వాలు ఈ ఖర్చు భరాయించలేవనటం కూటమి ప్రభుత్వం తరఫున ప్రభుత్వ సలహాదారుడిగా గరికపాటి గార్దభ శాపముల ఉందన్నారు. మధ్యాహ్న భోజన పథకం 1960 సంవత్సరంలో తమిళనాడు ముఖ్యమంత్రి కామరాజు నాడర్ ప్రవేశపెట్టిన పేదల ఆకలి తీర్చే పేద పిల్లలను విద్యావంతుడు చేసే మహోన్నత కార్యక్రమం అన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని చెప్పాల్సింది ప్రధానమంత్రి,ముఖ్యమంత్రులు గాని ప్రవచనాలు చెప్పి బ్రతికే సోమరిబోతు గరికపాటి కాదన్నారు సనాతన సలహాలు ఇవ్వటానికి ముహూర్తాలు పెట్టటానికి ఓట్ల కోసం బిజెపి ప్రభుత్వం బిజెపి ప్రభుత్వ మెప్పుకోసం గరికపాటి ని కాపలాగా నియమిస్తే కుక్క బదులు మొరిగి చావు దెబ్బలు తిన్న గాడిదల గరికపాటి మారేడు అన్నారు.. మధ్యాహ్న భోజనంలో విద్యార్థుల పౌష్టిక ఆహారం కోసం 2006 నుండి కోడి గుడ్డు పెడుతున్నారని ఇది ప్రభుత్వ దయ ధర్మం కాదని రాజ్యాంగం కల్పించిన పౌష్టికాహార హక్కు అని నేల నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద పిల్లల్లో విద్యను ప్రోత్సహించడానికి డ్రాప్స్ ఔట్స్ తగ్గించటానికి సుప్రీం



కోర్ట్ ఇచ్చిన ఆదేశాల మేరకు భారతదేశమంతా మధ్యాహ్న భోజనం అమలవుతున్న విషయాన్ని గరికపాటి గుర్తించుకోవాలన్నారు. విద్యార్థులకు ఇచ్చే గుడ్డుపై గగ్గోలు పెడుతున్న గరికపాటి 99 రూపాయలకు ప్రభుత్వం ఎకరా భూమి ఇస్తే తప్పేంటని అన్న విద్యాశాఖ మంత్రి లోకేష్ వ్యాఖ్యలపై ఎందుకు స్పందించలేదన్నారు. వారాలు చేసి చదువుకున్న పండితులు మేధావులు పేద విద్యార్థులకు ప్రభుత్వాలు పెట్టే గుడ్డుపై రంకెలు వేయటం తగదన్నారు. విద్యార్థులు చదివించడానికి ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవు అంటున్న కూటమి ప్రభుత్వ సనాతన సలహాదారుడు గరికపాటి నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యార్డ్ పథకం ద్వారా 60 శాతం కేంద్ర ప్రభుత్వం 40% రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన ఖర్చులు భ రాయించాలన్న విషయాన్ని గుర్తించా లన్నారు. గరికపాటి వ్యాఖ్యలపై విప్లవ అభ్యుదయ ఉపాధ్యాయ సంఘాలు కూడా స్పందించకపోవడం వారి సనాతన చైతన్యానికి దర్పణం అన్నారు. రాజులను పొగిడి అగ్రహారాలు, మాన్యాలు, పొందిన వారికి గర్భగుడుల్లో అర్చనలు చేసే పూజారులకు వేలాదేళ్లుగా విద్యకు దూరమైన బహుజన విద్యార్థులు కోడుగుడ్డు తినటం కూడా సహించలేకపోతున్నారన్నారు. గుడ్డు వంకతో పేద పిల్లల విద్యపై మనువాద విషం చిమ్మిన మనువాద డ్రాగన్ గరికపాటి అన్నారు. బీసీ కులానికి చెందిన అనంతపురం సత్యసాయి తరఫున సదరు ట్రస్ట్ వారు పిల్లల మధ్యాహ్న భోజనములో రాగి జావా పంపిస్తున్నారన్న విషయాన్ని కూటమి ప్రభుత్వ పండితులు గరికపాటి తెలుసుకోవాలన్నారు. గుడ్డు వంకతో పేదల విద్యపై శాపనార్ధాలు పెట్టిన సనాతన కూటమి ద్రోణాచార్యుడు..గరికపాటికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పద్మశ్రీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రభుత్వ సలహాదారుడు పదవిని రద్దు చేయాలని బిజెపి కూటమి ప్రభుత్వాలను దళిత నేత నేల నాగేంద్రరావు డిమాండ్ చేశారు.

# 10వ తరగతి హిందీ ప్రశ్న పత్రంలో యంపిహెచ్ మెటీరియల్ నుంచి 74 మార్కులు

**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, మార్చి 22)**



గిద్దలూరు పట్టణానికి చెందిన డాక్టర్ మొర్రి పిచ్చయ్య హిందీ ఉపాధ్యాయులుగా 20 సంవత్సరాల సర్వీసు కలిగి రాష్ట్ర రిసోర్స్ పర్సన్ గా, ప్రకాశం జిల్లా హిందీ అకాడమిక్ ఫోరం సభ్యులుగా పనిచేస్తున్నారు. విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈ సంవత్సరం 10.వ తరగతి హిందీ పరీక్ష వ్రాయబోతున్న విద్యార్థులకు బ్లూ ప్రింట్ ఆధారంగా ముఖ్యమైన మెళకువలను, విషయ సమాచారాన్ని మరియు వ్యాకరణాంశాలను తయారు చేశారు. ఈ యంపిహెచ్ మెటీరియల్ నుంచి 18వ తేదీన జరిగిన హిందీ ప్రశ్న పత్రంలో నేరుగా 74 మార్కులు వచ్చాయని తెలిపారు. హిందీ ప్రశ్న పత్రంలోని ప్రశ్న సంఖ్యలు 2, 6, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 15, 16, 17, 19, 21, 22, 23, 24, 25, 26లు మొత్తం 20 ప్రశ్నలు డైరెక్ట్‌గా వచ్చాయన్నారు. ఈ మెటీరియల్ ఫాలో అయిన రాష్ట్రంలోని హిందీ ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి ఫోన్ కాల్స్ ద్వారా అభినందనలు, కృతజ్ఞతలు ఎక్కువ సంఖ్యలో తెలిపారన్నారు. పదో తరగతి హిందీ సబ్జెక్టులో ఫెయిల్ పర్సంటేజ్ తగ్గించాలనే లక్ష్యంతో తాను కృషి చేస్తున్నన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు, ప్రకాశం జిల్లా వారి ఆదేశాల మేరకు తాను తయారు చేసిన 20 మార్కుల స్లిప్ టెస్టుల నుంచి 59 మార్కులు నేరుగా వచ్చాయని తెలిపారు. హిందీ పబ్లిక్ పరీక్షలో తాను తయారు చేసిన యం.పి.హెచ్ మెటీరియల్ నుంచి 74 మార్కులు నేరుగా 16 మార్కులు ఇన్ డైరెక్ట్ గా వచ్చాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హిందీ భాషా ప్రచారానికి, అభివృద్ధికి తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉగాది పండుగ తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని, ఈ సంవత్సరం పదో తరగతి హిందీ పబ్లిక్ పరీక్షలో ఫెయిల్ పర్సంటే సంఖ్య చాలా తక్కువ ఉండబోతుందని తెలిపారు.

# బాకీ అడిగితే కత్తితో గాట్లు పెట్టుకుని బెదిరిస్తున్నారు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 22)**

తనకు రావలసిన డబ్బులు అడిగితే కత్తితో గాట్లు పెట్టుకుని హత్య చేసేందుకు వచ్చారని తన పైనే పోలీస్ స్టేషన్లో కేసులు పెడుతున్నారని మద్దిపాడు మండలం ఇనమనమెళ్లురు గ్రామానికి చెందిన కోటు ఆంజనేయులు మీడియా ముందు వాపోయారు. ఒంగోలు నగర పరిధిలోని పెర్న మెట్ట గ్రామ పరిధిలోని 40వ డివిజన్లో వివాదాస్పద స్థలము వద్ద ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా కోటు ఆంజనేయులు మాట్లాడుతూ ప్రాథమిక పరిధిలోని 40వ డివిజన్లో సర్వే నెంబర్ 135 లో 38 గదుల స్థలం ప్రాథమిక చెందిన పులి కృష్ణవేణి రెడ్డి స్థలం కొనుగోలు నిమిత్తం తన వద్ద నుండి 2023 నవంబర్ 25వ తేదీన రూ. 6 లక్షల 19 వేల 200 రూపాయలు బాకీ అయినట్లు పేర్కొన్నారు. ఎన్నిసార్లు డబ్బులు అడిగినా ఇవ్వకుండా దాటవేత ధోరణి అవలంబిస్తున్నారన్నారు. కృష్ణవేణి స్థలంలో భవనం నిర్మించుకోవడానికి నాకు చెందిన స్థలంలో తాత్కాలిక నివాసము ఏర్పాటుకు తన అంగీకారం అడిగారన్నారు. అందుకు తాను సమ్మతించగా నాకు చెందిన స్థలంలో రేకుల షెడ్డు నిర్మించి దానిలో చిల్లర కొట్టు, వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. ఆరు నెలల తర్వాత తన స్థలాన్ని వేరే వారికి రూ. 10 లక్షలకు అమ్మి వేశారన్నారు. విషయం తెలుసుకున్న నేను నా స్థలాన్ని ఖాళీ చేయమని అడగ్గా నా స్థలంలో నిర్మించిన రేకుల షెడ్లు, పైపులను పగలగొట్టారు అన్నారు. అప్పటినుండి నేను డబ్బులు అడుగుతుండగా ఇవ్వకుండా తిప్పించు కుంటున్నారు. ఈ విషయమై తాలూకా పోలీస్ స్టేషన్లో కూడా కేసు నమోదు చేయడం జరిగింది అన్నారు. తిరిగి ఆదివారం నేను డబ్బులు అడగగా కృష్ణవేణి తనకు తాను గాయాలు చేసుకొని కింద పడిపోయి నాటకమాడిందన్నారు. అంబులెన్స్ వచ్చిన కావాలని గంటసేపు అక్కడే ఉన్నారు అని, ఆమె పై తాము ఎటువంటి దాడి చేయలేదని, కేవలం డబ్బులు అడిగినందుకే ఆమె కై ఆమె కత్తితో గాయపరచుకొని తమను బెదిరిస్తుందని పేర్కొన్నారు.

# పేకాట శిబిరంపై దాడి



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 22)**

పొన్నలూరు డొంక ప్రాంతంలో పొగాకు పంట పొలాల మధ్య పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఎస్ఐ సత్యనారాయణ ఆదివారం అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులో తీసుకొని వారి వద్ద నుండి రూ.5,280 నగదను స్వాధీనం పరచుకున్నారు. సత్యనారాయణ మాట్లాడుతూ జూద క్రీడలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 22)**

సోమవారం 33/11కేవీ భీమవరం సబ్ స్టేషన్‌కు సంబంధించిన మరమ్మతుల నిమిత్తం భీమవరం, బద్దిపూడి, కె రాజుపాలెం, ఎల్ రాజుపాలెం గ్రామపంచాయతీ, దాని పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిలిపివేయబడుతుందన్నారు. వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాల్సిందిగా సింగరాయకొండ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోరారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com